నమస్తే తెలంగాణ

# హైదరాబాద్

హైదరాబాద్- మేడ్చల్

I | హైదరాబాద్, మంగళవారం 13 మే 2025 | HYDERABAD





పభుత్వం ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించాలని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు నియోజకవర్గంలోని సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలంటూ.. సోమవారం సికింద్రాబాద్‌లోని జోనల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతాశోభన్ రెడ్డికి ఎమ్మెల్యే వినతిపత్రం అందజేశారు. వివిధ అంశాలను డిప్యూటీ మేయర్ దృష్టికి తీసుకొచ్చారు. -మల్కాజిగిరి, మే 12



నియోజకవర్గస్థాయిలో ఏకకాలంలో 500 మంది గర్భిణులకు సామూహికంగా సీమంతం నిర్వహించే కార్యక్రమాన్ని చేపట్టేందుకు కార్యాచరణతో ముందుకు వెళ్తానని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ హామీ ఇచ్చారు. మాతృ దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం డీకే రోడ్‌లోని అతిథి హోటల్‌లో మాజీ కార్పొరేటర్ శేషు కుమారి, బీఆర్‌ఎస్ నాయకురాలు రోజారెడ్డి ఆధ్వర్యంలో సుమారు 120 మంది గర్భిణులకు జరిగిన సామూహిక సీమంతంలో ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే పాల్గొన్నారు. కుటుంబ పెద్దగా నిలిచి గర్భిణులకు చీరలు, గాజులు, పసుపు, కుంకుమ అందజేశారు. -అమీర్‌పేట్

రారెత్తిస్తున్న ఎండలు.. అందాలభామల అవస్థలు




ఇండియా కంటెస్టెంట్ నందినీ గుప్తా



సోమవారం నాగార్జునసాగర్‌లోని బుద్ధవనంలో అందాల భామల సందడి

# అమ్మో టూర్లా! రాలేం

## హీట్‌వేవ్‌కు సుందరీమణుల హడల్

**టూర్లకు నో చెబుతున్న మిస్ వరల్డ్ పోటీదారులు**

**ఇక్కడి ఉష్ణోగ్రతలు తట్టుకోలేక సతమతం**

**120 మందిలో 22 మంది మాత్రమే బుద్ధవనంకు**

సిటీబ్యూరో, మే 12 (నమస్తే తెలంగాణ): 'ఓ మై గాడ్... ఇట్ ఈజ్ సో హాట్.. ఐ డీస్ట్ ఎక్స్‌పెక్ట్ ఇట్... ఐ విష్ ఐ హ్యాడ్‌నాట్ కమ్.' అంటూ ప్రపంచ అందాల భామలు ఔట్‌డోర్ టూర్లపై పెదవి విరుస్తున్నారు. భానుడి భగభగలకు సుందరీమణులు ఇబ్బందులుపడుతున్నారు. వందలాది కిలో మీటర్ల ప్రయాణం వారికి చికాకు తెప్పిస్తున్నట్టు చర్చించుకుంటున్నారు. మండుటెండల్లో వందలాది కిలో మీటర్ల ప్రయాణానికి వాళ్లంతా వెనకడుగు వేస్తున్నారు. టూర్లకు తాము రాబోమని నిర్వాహకులకు చెప్పేస్తున్నారని ఓ అధికారి 'నమస్తే'కు తెలిపారు. అందుకే మొదట్లో కంటెస్టెంట్లందరితో పర్యాటక టూర్‌కు ప్రణాళికలు చేసిన అధికారులు.. ఇప్పుడు వాళ్ల అనాసక్తి కారణంగా కొందరిని మాత్రమే టూర్‌కు తీసుకెళుతుండటం విశేషం. సోమవారం 120 మందిలో 22 మందిని మాత్రమే నాగార్జున సాగర్ బుద్ధవనం టూర్‌కు తీసుకెళ్లారు.

### రారెత్తిస్తున్న ఎండలు..

రాష్ట్రంలో భానుడి భగభగలు చుక్కలు చూపిస్తున్నాయి. ఇలాంటి సమయంలో ప్రపంచ అందాల పోటీల్లో పాల్గొనడానికి వచ్చిన కంటెస్టెంట్స్‌తో దూర ప్రయాణాలను పర్యాటక శాఖ ప్లాన్ చేయడంపై విమర్శలు వస్తున్నాయి. ఈనెల 31న హైటెక్స్‌లో ఫైనల్ పోటీలు జరుగుతాయి. ప్రపంచ సుందరీ ఎవరో ఆ రోజే తెలిసిపోతుంది. 17 రోజుల సమయం మాత్రమే ఉంది. కాగా, పోటీలకు సంబంధించిన రౌండ్లు 22న మిస్ వరల్డ్ టాలెంట్ ఫినాలే ఉంటుంది. 23న హెడ్ టూ హెడ్ చాలెంజ్ ఫినాలే, 24న ఫ్యాషన్ ఫినాలే ఉంటుంది. ఈ స్వల్ప కాలంలో వాళ్లంతా టైటిల్ దక్కించుకోవడానికి తీవ్ర కసరత్తు చేయాల్సి ఉంటుంది. ఇలాంటి సమయంలో పర్యాటక శాఖ సుదూర ట్రిప్పులు ప్లాన్ చేశారు. మంగళవారం హైదరాబాద్‌లోని హెరిటేజ్ వాక్ ఉండగా, మరుసటి రోజున వరంగల్, 15న పోచంపల్లి సందర్శన ఉండనున్నది. కాగా మిస్ వరల్డ్ 2025 కంటెస్టెంట్స్ హెరిటేజ్ వాక్, డిన్నర్ సందర్భంగా హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్లు సిటీ ట్రాఫిక్ అడిషనల్ కమిషనర్ జోయల్ డేవిస్ తెలిపారు. చార్మినార్ వద్ద హెరిటేజ్ వాక్, చౌహముల్లాప్యాలెస్‌లో డిన్నర్ నేపథ్యంలో మదీనా - చార్మినార్ - శాలిబండ - ఓల్గాజంక్షన్ - మూసబౌలి వయా ఖిలావత్ రోడ్ వరకు వెళ్లే అన్ని మార్గాల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు ట్రాఫిక్ ఆంక్షలు ఉంటాయన్నారు.



బుచ్చమ్మకు ఫిట్స్ రావడంతో హాస్పిటల్‌కు తరలిస్తున్న కుటుంబసభ్యులు

# వేడుకున్నా.. కనికరించలె

## బుల్డోజర్లతో పేదల ఇండ్లు నేలమట్టం..సొమ్మసిల్లిన ఓ మహిళ

జవహర్‌నగర్, మే 12: 'కూలీనాలీ చేసుకునేటోళ్లం.. చిన్నపాటి రేకుల ఇంటిని నిర్మించుకుంటే.. మాపైనే మీ ప్రతాపమా.. మేమెట్లా బతకాలి'.. పేదలు ఆవేదన వ్యక్తం చేశారు. పైసాపైసా కూడబెట్టుకొని.. ఇండ్లు కట్టుకుంటే.. నిర్ధాక్షిణ్యంగా కూల్చివేశారంటూ.. అధికారులు, ప్రభుత్వంపై దుమ్మెత్తిపోశారు. కాప్రా తహసీల్దార్ సుచరిత ఆధ్వర్యంలో జవహర్‌నగర్ కార్పొరేషన్‌లో రెవెన్యూ అధికారుల సమక్షంలో సోమవారం పలు పేదల ఇండ్ల కూల్చివేతలు చేపట్టారు. బాలాజీనగర్‌లో బుచ్చమ్మ అనే మహిళ రేకుల ఇంటిని బుల్డోజర్‌తో కూల్చివేశారు. తన ఇంటిని కూల్చవద్దని, మా బతుకులు ఆగమవుతాయని.. ఎంత బతిమిలాడినా.. వినలేదు. ఈ క్రమంలో బుచ్చమ్మకు ఆకస్మాతుగా ఫిట్స్ రావడంతో హుటాహుటినా దవాఖానకు తరలించారు. ఆమె పరిస్థితి ఆందోళనకరంగా ఉందని కుటుంబసభ్యులు తెలిపారు. రెవెన్యూ అధికారుల అత్యుత్సాహంతో పేద ప్రజల ప్రాణాలు పోతున్నాయంటూ జవహర్‌నగర్ ప్రజలు మండిపడ్డారు. కూల్చివేతలు ఆపకుంటే కాంగ్రెస్ ప్రభుత్వంపై పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని హెచ్చరించారు.



## ఆగిన బతుకమ్మకుంట పనులు!

ప్రైవేటు స్థలమంటూ కోర్టుల్లో కేసులు..

›IVలో

# స్థలం ఒక చోట.. అనుమతులు మరో చోట..

## కదులుతున్న నాలా ఆక్రమణల డొంక

బంజారాహిల్స్,మే 12: బంజారాహిల్స్ రోడ్ నం. 11లో నాలా బఫర్ జోనల్‌లో ప్రైవేటు వ్యక్తులు నిర్మాణాలు చేపట్టిన వ్యవహారంపై నమస్తే తెలంగాణ పత్రిక సోమవారం 'నగరం నడిబొడ్డున నాలాకు ముప్పు' పేరుతో ప్రచురించిన కథనం ప్రకంపనలు సృష్టించింది. ఈ వ్యవహారంపై షేక్‌పేట మండల రెవెన్యూ అధికారులు లోతుగా పరిశీలన చేపట్టగా కీలక అంశాలు వెలుగులోకి వచ్చాయి. చెరువులు, కుంటలు, నాలాలను కాపాడాల్సిన నీటి పారుదలశాఖ అధికారులు సరైన పరిశీలన చేయకుండానే ఎన్‌వోసీ జారీ చేసినట్లు బయటపడింది. దీంతో పాటు జీహెచ్‌ఎంసీ అధికారులు సైతం రెవెన్యూ క్లియరెన్స్ లేకుండానే ఏకంగా ప్రభుత్వ స్థలంలో భవన నిర్మాణానికి అనుమతులు జారీ చేసినట్లు తేలడంతో కలకలం చెలరేగింది. ఈ మొత్తం వ్యవహారంలో సమగ్రమైన వివరాలతో షేక్‌పేట మండల తహసీల్దార్ అనితారెడ్డి జిల్లా కలెక్టర్‌కు నివేదిక పంపించారు. ఉదయ్‌నగర్ నాలాకు ఎగువ భాగంలో మిథిలానగర్ కాలనీలో గున్నా జైదీప్‌రెడ్డి, గున్నా సందీప్‌రెడ్డి తదితరులు సుమారు 1200 గజాల స్థలం చుట్టూ ఆదివారం ఫెన్సింగ్ వేశారు. ఈ స్థలాన్ని శివరాజ్ ఠాకూర్ అనే బిల్డర్‌కు డెవలప్‌మెంట్ కోసం ఇచ్చారు. అయితే ఫెన్సింగ్ వేసిన స్థలాన్ని ఆనుకుని ఉదయ్‌నగర్ నాలా ఉందని, రెవెన్యూ రికార్డుల ప్రకారం ఈ స్థలం మొత్తం సర్వే నంబర్ 403 లోని టీఎస్-నెంబర్ 2, వార్డు -11, బ్లాక్-ఎస్ లోకి వస్తుందని, టీఎస్ఎల్ఆర్ ప్రకారం ఈ స్థలం మొత్తం ప్రభుత్వానిదే అని సోమవారం షేక్‌పేట మండల రెవెన్యూ అధికారుల పరిశీలనలో తేలింది. గున్నా జైదీప్‌రెడ్డి, సందీప్‌రెడ్డి తదితరులు జీహెచ్‌ఎంసీ అనుమతి కోసం సమర్పించిన డాక్యుమెంట్స్‌లో తమ స్థలం టీఎస్ నంబర్ 29, బ్లాక్-ఓ, వార్డు-11 కిందకు వస్తుందని పేర్కొన్నారని..

మిగతా IVవ పేజీలో



వివాదాస్పద స్థలాన్ని పరిశీలిస్తున్న జీహెచ్‌ఎంసీ అధికారులు

## ద్రోణి ప్రభావంతో..

సిటీబ్యూరో: ఎండలు రారెత్తిస్తున్న వేళ.. సోమవారం కురిసిన వర్షానికి నగరం కొంత చల్లబడింది. ద్రోణి ప్రభావంతో మరో రెండు రోజులు పలు చోట్ల వానలు కురిసే అవకాశాలు ఉన్నట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు.



# స్మార్ట్ కార్డుల కొరత




సిటీబ్యూరో, మే 12 (నమస్తే తెలంగాణ) : ఆర్టీఏ కార్యాలయాల్లో స్మార్ట్ కార్డుల కొరత వెంటాడుతున్నది. 20 రోజులు గడిచినా ఆర్‌సీ, లైసెన్స్ కార్డులు అందడం లేదు. దీంతో వాహనదారులు సంబంధిత రవాణా శాఖ ఖార్యాలయాల చుట్టూ తిరగాల్సివస్తున్నది. పోస్టులో మీ ఇంటికే చేరుతుందని అధికారులు చెప్పి చేతులు దులుపుకొంటున్నారు. డ్రైవింగ్ లైసెన్స్, ఆర్‌సీ కార్డులు నిర్ణీత సమయంలో అందక పోవడంపై విస్మయం వ్యక్తం చేస్తున్నారు. సాధారణంగా వారం రోజుల వ్యవధిలో చిరునామాకు లైసెన్స్‌లు, ఆర్‌సీలు చేర్చాల్సిన అధికారులు స్మార్ట్ కార్డుల కొరతతో విమర్శలు ఎదుర్కోవాల్సి వస్తున్నది. లైసెన్స్‌లు, ఆర్‌సీ కార్డుల జారీకి వాహనదారుల నుంచి ముందుగానే ఫీజు కట్టించుకుంటారు. కానీ కార్డులు జారీ చేయడానికి మాత్రం జాప్యం చేస్తున్నారు. గ్రేటర్‌లోని అన్నీ ఆర్టీఏ కార్యాలయాల్లో ఇదే సమస్య ఉన్నట్టు వాహనదారులు చెబుతున్నారు.

# విద్యార్థినిపై లైంగిక దాడి

## బాధితురాలి స్నేహితుడితో పాటు మరో వ్యక్తి అరెస్టు

దుండిగల్, మే 12: బయో ఇంజినీరింగ్ ఇంటర్న్‌షిప్ కోసం నగరానికి వచ్చిన ఓ విద్యార్థినిపై ఆమె స్నేహితుడు, మరో యువకుడు లైంగిక దాడికి పాల్పడిన ఘటన బాచుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సీఐ ఉపేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. జార్ఖండ్‌కు చెందిన యువతి (20) చెన్నైలోని ఓ కళాశాలలో బయో ఇంజినీరింగ్ ఫైనల్ ఇయర్ చదువుతున్నది. అదే కళాశాలలో బాచుపల్లి హరితవనం కాలనీకి చెందిన అజయ్ (24) బీటెక్ చదువుతున్నాడు. దీంతో ఇద్దరి మధ్య స్నేహం కుదిరింది. యువతి బయో ఇంజినీరింగ్ కోర్సు పూర్తి కావడంతో జూబ్లీహిల్స్‌లోని అపోలో హాస్పిటల్‌లో ఇంటర్న్‌షిప్ సీట్ ఇప్పిస్తానని చెప్పిన అజయ్.. ఈనెల 3న ఆమెను చెన్నై నుంచి నగరానికి రప్పించాడు. నిజాంపేట రాజీవ్ గృహకల్ప సముదాయంలోని రూమ్‌కి తీసుకొచ్చాడు. సదరు యువతితో పాటు అజయ్ అతడి స్నేహితుడు హరితో కలిసి మద్యం(వోడ్కా) తాగారు. అర్ధరాత్రి దాటిక యువతిపై మొదట అజయ్.. ఆ తర్వాత హరి లైంగికదాడికి పాల్పడ్డారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు నిందితులిద్దరిని అరెస్టు చేశారు.

## అమర జవాన్లకు ఘన నివాళి




శంషాబాద్ రూరల్, మే 12 : అమర జవాన్లకు తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ రంగారెడ్డి జిల్లా కమిటీ ఘనంగా నివాళులర్పించింది. ఈ మేరకు జర్నలిస్టులు ర్యాలీ నిర్వహించి.. అంబేద్కర్ విగ్రహం వద్ద అమర జవాన్ మురళీనాయక్‌కు శ్రద్ధాంజలి ఘటించారు. రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.




హయత్ నగర్: అమర జవాన్లకు నివాళులర్పిస్తూ..హయత్ నగర్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ నాగరాజ్ గౌడ్, వనస్థలిపురం ట్రాఫిక్ ఆర్ఐ శ్రీశైలం యాదవ్ ఆధ్వర్యంలో మండల కార్యాలయం నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు.